ప్రజాశక్తి
శుక్రవారం 27 అక్టోబర్ 2023
5
విజయనగరం

ఎపి పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 30 నుంచి నవంబర్ 2 వ తేదీ వరకు కేరళ రాష్ట్రం ఎర్నాకులం లో జరగబోయే 35వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్ లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టుకు కోచ్‌గా విజయనగరం హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఉద్యోగం చేస్తున్న కబడ్డీ క్రీడాకారుడు పతివాడ శ్రీనివాస రావును నియమిస్తూ విజయవాడ సర్కిల్ ఆఫీస్ నుండి ఉత్తర్వాలు వచ్చాయి. శ్రీనివాసరావు 1997 నుండి పలు జాతీయ పోటీల్లో పాల్గొని ఎన్నోపతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా పలుమార్లు వ్యవహరించారు. శ్రీనివాస రావు నియామకం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కార్యదర్శి ఈశ్వర్ కౌశిక్ , సూరిబాబు, కబడ్డీ గురువు బొమ్మన రామారావు, తపాలా శాఖ సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వం రిజర్వు చేసిన భూముల్లో నుంచి వేసిన రహదారి

ఎయిర్‌పోర్టు అదనపు భూముల్లో

అడ్డగోలు రహదారి

రిసార్ట్ సంస్థ కొత్తగా వేస్తున్న లేఔట్‌కు అనుసంధానం చేసిన రహదారి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటనలకు వచ్చే ప్రభుత్వ పెద్దలైనా.. అధికారులైన భోగాపురం మండలంలోని అత్యంత ఖరీదైన ప్రముఖ రిసార్ట్‌లోనే సేద తీరుతుంటారు. అది పగలైనా రాత్రైనా. అందుకేనేమో.. ఇంకెవడ్రా మనల్ని అపేది అనుకుందేమో ఆ రిసార్ట్ సంస్థ. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం పరిహారం అందజేసి విమానాశ్రయం కోసం సేకరించిన భూముల నుంచి ఎటువంటి అనుమతులూ లేకుండానే ఏకంగా ఆ రిసార్ట్ సంస్థ తాము కొత్తగా వేస్తున్న వ్యాలీ అనే రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అడ్డుగోలుగా గ్రావెల్ రోడ్డును దిబ్బలపాలెం సమీపంలో నిర్మించుకుంది. అదికూడా త్వరలో నిర్మించబోయే బీచ్ కారిడార్ రోడ్డునుంచి నేరుగా తమ వెంచర్ వరకు వేసేశారు. మరి ఇంత అడ్డగోలుగా ఆ సంస్థ తమ సొంత యంత్రాలతో గత కొన్ని రోజులు నుంచి నిర్మిస్తుంటే అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకోవడం విశేషం. భోగాపురం మండలంలో ఆ రిసార్ట్ సంస్థ చేస్తున్న అడ్డగోలు వ్యవహారం ఇది. వివరాల్లోకి వెళితే...

- అనుమతులు లేకుండానే 3 కిలోమీటర్లు రహదారి నిర్మాణం
- ఓ రిసార్ట్ సంస్థ నిర్వాకం
- సేదతీరిన రిసార్ట్ రుణం తీర్చుకుంటున్న పెద్దలు, అధికారులు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం మండలంలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం సుమారు 2700 ఎకరాలు భూములను సేకరించింది. సేకరించిన భూముల్లో సుమారు 500 ఎకరాలు ప్రభుత్వం ఐటి కంపెనీలకు, ఇతర అవసరాలకు రిజర్వులో ఉంచింది. ఈ భూమికి పడమర వైపు ఈ రిసార్ట్ సంస్థ కొత్తగా వ్యాలీ పేరుతో వెంచర్ వేస్తోంది. ఈ వెంచర్‌కు సుమారు 3కిలో మీటర్లు దూరంలో కొత్తగా నిర్మించబోయే బీచ్ కారిడార్ రోడ్డు ఉంది. ఈనేపథ్యంలో దిబ్బలపాలెం వెళ్లే రహదారికి నేరుగా ప్రభుత్వం అట్టిపెట్టుకున్న 500 ఎకరాల్లో నుంచి గత కొన్ని రోజులుగా సుమారు 40అడుగుల విస్తీర్ణంతో రహదారిని నిర్మించేశారు. ఈ రహదారి బీచ్‌కు ఆనుకొని మరో పెద్ద వెంచర్ ఈ సంస్థకు ఉంది. అయితే ఈ రెండింటికి అనుసంధానం చేసేలా అడ్డగోలుగా ఈ భూముల్లో నుంచి రహదారిని నిర్మించేశారు.

కొత్తగా వేస్తున్న లేఔట్

అనుమతులు లేకుండా..

ప్రభుత్వం అట్టి పెట్టుకున్న భూముల్లో నుంచి తమ వెంచర్‌కు రహదారిని నిర్మించేందుకు వీరికి ఎటువంటి అనుమతులు లేవు. కాని ఏకంగా తమ సొంత వాహనాలతో రహదారిని నిర్మించడం గమనార్హం. పోనీ విమానాశ్రయం పనులు జరుగుతున్నాయి అందుకోసం ఈ రహదారిని నిర్మించుకున్నారంటే ఈ భూములకు విమనాశ్రయం నిర్మాణానికి ఎటువంటి సంబంధమూ లేదు. అంతేకాక ఇంకా నిర్మించబోయే విమానాశ్రయం ప్రహరీ గోడ పక్క నుంచి ఈ రహదారిని నిర్మించారు. అంటే కేవలం తమ రియల్ ఎస్టేట్ వెంచర్‌లోని ప్లాట్లును అమ్ముకోవడానికి, ఈ రహదారి నేరుగా బీచ్‌కు వెళ్తుందని చూపించడానికి ఈ రహదారిని నిర్మించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇంతలా జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం.

రహదారిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం అట్టిపెట్టుకున్న భూముల్లో నుంచి రహదారిని వేస్తున్న వ్యవహారం మా దృష్టికి రాలేదు. ఆ రహదారికి అనుమతులు ఉన్నవీ లేనివీ పరిశీలిస్తాం. అవసమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రహదారిని నిర్మాణాన్ని నిలిపివేస్తాం.

- చింతాడ బంగార్రాజు, తహాశీల్దారు, భోగాపురం

రిఫరల్ కేసులను పర్యవేక్షించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం రూరల్, బొండపల్లి

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పరీక్షల అనంతరం అవసరమైన వారిని తదుపరి చికిత్సలకు నెట్‌వర్కు ఆసుపత్రులకు రిఫర్ చేయడమే కాకుండా, వారు పూర్తిగా వైద్య చికిత్స పొందేవరకు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వారందరికీ ఆరోగ్యశ్రీ పథకం క్రింద మెరుగైన వైద్యం అందేలా చూడాల్సిన బాద్యత వైద్యాధికారులపైనే ఉందని స్పష్టం చేశారు. బొండపల్లి మండలం బి.రాజేరు, విజయనగరం మండలం గొల్లలపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్, కౌంటర్లు, వైద్యసేవలు, ఇస్తున్న మందులు, నిర్వహిస్తున్న పరీక్షలు, రిఫరల్ కేసులపై ఆరా తీశారు. శిబిరానికి హాజరైన రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నవంబరు 15 నాటికి జిల్లా అంతటా ఆరోగ్య శిబిరాల నిర్వహణ పూర్తి అవుతుందన్నారు. ఒక గ్రామంలో శిబిరం పూర్తి అయిన వెంటనే రిఫరల్ కేసులపై పూర్తిగా దృష్టి పెట్టి, వారికి తదుపరి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిబిరాల్లోనే ఆరోగ్యశ్రీపై పూర్తిస్థాయిలో రోగులకు అవగాహన కల్పించి, వారు నెట్‌వర్కు ఆసుపత్రులకు వెళ్లేవిధంగా చూడాలన్నారు. సుగర్, బిపి లాంటి వ్యాధులు బయటపడితే, వారి ఆరోగ్యాన్ని ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. అటువంటి రోగులకు నెలనెలా ఉచితంగా మందులను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమాల్లో డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, బొండపల్లి ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఇన్‌ఛార్జి తాహాశీల్దార్ శంకర్రావు, విజయనగరం ఎంపిడిఓ జి.వెంకటరావు, డిటి కోటేశ్వర్రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

2,600 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా, ఇప్పటివరకు సుమారుగా 2,600 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బి.రాజేరులో విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలో వర్షాభావ పరిస్థితిని వివరించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యిందని చెప్పారు. తాజాగా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో, ఈ నెలాఖరులోగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామ వ్యవసాయ కార్యదర్శులు నిరంతరం పంటలను పర్యవేక్షిస్తూ, ఎండిన పంటలను నమోదు చేస్తున్నారని తెలిపారు. కాలువల ఆయకట్టు భూములకైనా సక్రమంగా నీరు అందించి, పంటలకు కాపాడుకునేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మెడికల్ కిట్లు అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిర్ణీత సమయానికే సిరిమానోత్సవం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎట్టి పరిస్థితుల్లోను నిర్ణీత సమయానికి సిరిమాను రథాన్ని సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సూచించారు. గురువారం పైడితల్లమ్మ కళ్యాణమండపంలో పైడిమాంబ సేవా సంఘం, వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. గత సంవత్సరం సిరిమాను ఊరేగింపు ఆలస్యం కావడానికి గల కారణాలపై సమీక్షించారు. సిరిమాను శీల బిగింపు, కట్లు కట్టడం, ఇరుసుమానుకు సిరిమానును అమర్చడం వంటివి నిర్మాణపు ప్రక్రియలు నిర్ణీత సమయాన్ని కల్లా పూర్తి చేసే విధంగా చూడాలని హుకుంపేటలోని జాతర ప్రక్రియలో భాగస్వామ్యం అయిన వారికి సూచించారు. సిరిమాను తయారు చేసే వడ్రంగి ప్రతినిధులతో చర్చించారు. సిరిమానుతో పాటు రథాలు తిరిగే సమయంలో ఇతరులను అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు సూచించారు. అందరి సహకారంతో పైడితల్లమ్మ సిరిమాను జాతరను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనాలు జరిగే విధంగా చూస్తున్నామన్నారు. సమావేశంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆర్‌జెసి యం.వి.సురేష్ బాబు, ఆర్‌డిఒ సూర్యకళ, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, డిఎస్‌పిలు గోవిందరావు, విశ్వనాథ్, ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోలగట్ల వీరభద్రస్వామి

ఉత్సవాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం

పైడితల్లి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఈనెల 29నుంచి 31 తేదీ వరకు పలు చోట్ల ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాలు 24 గంటలూ పనిచేస్తాయని, ఉదయం 8 గంటలు నుంచి రాత్రి 9 గంటలు వరకు ఈ కేంద్రాల్లో డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ మేరకు ఆయా కేంద్రాలకు వైద్యులను, పారా మెడికల్ సిబ్బందిని నియమిస్తూ ఆదేశాలను జారీ చేశారు. 29, 30తేదీల్లో అయోధ్యా మైదానం, లయన్స్ కమ్యూనిటీ హాలు, ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్, గురజాడ కళాభారతి, ఎం.ఆర్. సంగీత కళాశాల, కోట, ఆనందగజపతి ఆడిటోరియం వద్ద, ఈనెల 29 నుంచి 31 వరకు బొంకుల దిబ్బ, ట్యాంకుబండ్ రోడ్డులోని మాన్సాస్ గ్రౌండ్, రాజీవ్ స్టేడియం వద్ద ఈ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. 30,31 తేదీల్లో రైల్వేస్టేషన్, కోట జంక్షన్, రాజారావు మేడ, ఆర్‌టిసి కాంప్లెక్స్, అమ్మవారి ఆలయం వెనుక, గుమ్చీ వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలు ఉంటాయని తెలిపారు.

రాష్ట్రానికి మోడీ ద్రోహం

- 'ప్రజా ప్రణాళిక' ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- ప్రజా రక్షణ భేరి యాత్ర, బహిరంగ సభలను విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మన రాష్ట్రానికి ద్రోహం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు.. బిజెపితో కలిసి ఆడుతున్న కపటనాటకాలకు తెరదించే సమయం వచ్చిందన్నారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో 'లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం' సిపిఎం ప్రజా ప్రణాళిక బ్రోచరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రజా ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా రక్షణ భేరి పేరుతో సిపిఎం బస్సు యాత్ర నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి బస్సుయాత్రలు ప్రారంభమవుతాయని తెలిపారు.

బిజెపి పాలనలో దేశం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. మత విద్వేషాలు సృష్టిస్తున్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదనంతా ఆదానీ, అంబానీలకు దోచి పెడుతుందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాజధాని నిర్మాణం, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి విభజన హామీల్లో ఏ ఒక్కదానిని బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అంతటితో ఆగకుండా రాష్ట్రానికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కు పరిశ్రమను తెగనమ్మడానికి తయారైందని అన్నారు. రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన బిజెపితో రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు అంటకాగుతున్నాయన్నారు. ఈపరిస్థితుల్లో అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన బస్సు యాత్రను, విజయవాడలో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 30న మన్యం జిల్లాలో ప్రారంభమయ్యే బస్సు యాత్ర 31 తేదీ సాయంత్రం మెంటాడ చేరుకుంటుందని తెలిపారు. బహిరంగ అనంతరం రాత్రి అక్కడే నాయకులు బస చేస్తారని తెలిపారు. నవంబర్ 1 తేదిన ఉదయం 10 గంటలకు గజపతినగరం, 12 గంటలకు బుడతనాపల్లి లో బహిరంగ సభలు జరుగుతాయని తెలిపారు. అనంతరం గంట్యాడ మీదుగా అరకు వెళ్లనుందని తెలిపారు. రెండో బస్సుయాత్రను నవంబర్ 2న శ్రీకాకుళం జిల్లా మందసలో అఖిలభారత నాయకులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ యాత్ర 3న విజయనగరం చేరుకుంటుందని, ఉదయం 9.30 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

మధ్యాహ్నం 4 గంటలకు శృంగవరపుకోట, 5 గంటలకు కొత్త వలసలో బహిరంగ సభలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం విశాఖపట్నంలోకి యాత్ర ప్రవేశించనుందని తెలిపారు. యాత్రల ముగింపు సందర్భంగా నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందని, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ, వి.లక్ష్మి పాల్గొన్నారు.

సిపిఎం ప్రజా ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులు

రైతులకు సాగు నీరివ్వాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

సమావేశంలో మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-బొబ్బిలి

నదుల ను అనుసంధానం చేసి రైతులకు సాగునీరు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గంటి ప్రసాదం భవనంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెపుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు సాగునీరు ఇవ్వడంలో విఫలమయ్యారని విమర్శించారు. జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు ఇవ్వడంలో పాలకులు విఫలమవుతున్నారని తెలిపారు. జిల్లాలో ఉన్న నదులను సాగనీటి కాలువలకు అనుసంధానం చేసి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరణ చేయాలన్నారు. రైతు పండించే ఆహార ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు లేక ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం లేఖ

విజయనగరం టౌన్ : జిల్లాలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల్లో ప్రాజెక్టుల నుంచి నీటిని చివరి భూములు వరకు అందించి పంటలను కాపాడాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు గురువారం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. జిల్లా లో వర్షాభావ పరిస్థితుల వల్ల వరి పంట నీరు లేక ఎండిపోతోందని పేర్కొన్నారు. తోటపల్లి, వెంగలరాయ, తాటిపూడి, ఆంధ్ర ప్రాజెక్టులు, ఆనకట్టలు, చిన్న నీటి వనరుల నుంచి చివరి ఆయకట్టు భూములకు నీరు వెళ్లక ఎండి పోతున్నాయని తెలిపారు. కాలువల నిర్వహణ లేకపోటంతో నీరు వున్నప్పటికీ శివారు భూములకు అందడం లేదని తెలిపారు. శివారు భూములకు నీరందించేవిధంగా నీటిపారు దల శాఖ సిబ్బందికి ఆదేశాలివ్వాలని కోరారు.

కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా రమాదేవి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో కార్మిక శాఖ అధికారిగా పనిచేస్తున్న ఆర్.రమాదేవికి సహాయ కమిషనరుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేసారు. మధురవాడలో కార్మిక శాఖ సహాయ కమిషనరుగా ఉద్యోగోన్నతి పొందిన రమాదేవికి కార్మిక శాఖ అధికారులు, పలువురు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌టిసి అధికారులు

ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి ప్రవేశపెట్టిన కార్గో డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న పార్సిల్ రవాణా కార్యాలయం వద్ద గురువారం కమర్షియల్ ఎటిఎం దివ్యతో కలిసి డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అతి తక్కువ చార్జీలతో ఆర్‌టిసి కార్గో సేవలను ప్రజలలోకి తీసుకుని వెళ్లే సదుద్దేశ్యంతో ఈనెల 26 నుంచి నవంబర్ 25వరకు మాసోత్సవాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరం లోని ప్రజలు, వ్యాపార సంస్థలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గజపతినగరం

అసమానతల్లేని అభివృద్ధి కోసం' సిపిఎం ప్రజా ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను జయప్రదంచేయాలని సిపిఎం నాయకులు వి.లక్ష్మి, జి.శ్రీనివాస్, రాకోటి రాములు పిలుపునిచ్చారు. గురువారం రక్షణభేరి బస్సుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిపిఎం నాయకులు చేపట్టిన బస్సుయాత్ర ఈనెల 31న సాయంత్రం మెంటాడ చేరుకుంటుందని, అనంతరం అక్కడ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. 1వ తేదీ ఉదయం 10గంటలకు గజపతినగరంలో సభ జరుగుతుందని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రత్యామ్నాయ విధానాలను వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాకోటి హరికృష్ణవేణి పాల్గొన్నారు.

పోలీసు సేవలపై అవగాహనకే ఓపెన్ హౌస్

ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసుశాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించేందుకే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండులో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎస్‌పి ఎం.దీపిక, పోలీసు అధికారులు 'ఓపెన్ హౌస్'ను సందర్శించి, విద్యార్థులతో మమేకమయ్యారు. పోలీసుశాఖనిర్వహించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాలు పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తి నింపారు. పోలీసుశాఖ కేసులు చేధనలో ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, వివిధ ఆయుధాలు, డ్రోన్స్ వినియోగం, వేలి ముద్రల సేకరణ, బాడీవార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్స్ మరియు ఇతర పరికాలు, నేర పరిశోధనలోను, బాంబులను గుర్తించడంలో పోలీసు డాగ్‌ల పని తీరు, బాంబ్ డిస్పోజల్ పరికరాలు, దిశ యాప్ గురించి విద్యార్థులకు, ప్రజలకు వివరించారు. ఎస్‌పి విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి, వాటికి సరైన జవాబులు చెప్పిన విద్యార్థులకు ఎకె 47 ఆయుధంతో ఫోటోలు తీయించి, వాటిని విద్యార్థులకు బహూకరించారు. జిల్లా పోలీసు శాఖలో కమ్యునికేషన్ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుందన్నారు. దిశాయాప్ మనతో ఉంటే – రక్షణ మన వెంటే అని అన్నారు. కార్యక్రమం లో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఎస్.వెంకటరావు, సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, విజయనగరం రూరల్ సిఐ టి.వి. తిరుపతిరావు, దిశ సిఐ బి. నాగేశ్వరరావు, నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

తుపాకుల వినియోగంపై విద్యార్థులకు వివరిస్తున్న ఎస్‌పి

సకాలంలో వైద్యమందక గర్భిణీ మృతి

గజపతినగరం : సకాలంలో వైద్యం అందక గర్భిణీ మృతి చెందిన సంఘటన గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. గొల్లపాలెం గ్రామానికి చెందిన గొల్ల ఉష ఉదయం 5.30గంటలకు ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకురాగా వైద్యుల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. సకాలంలో వైద్యం అందక ఆమె మృతి చెందింది. వైద్యులు వైద్యం అందించక పోవడంతోనే ఆమె మరణించిందని కుటుంబ సభ్యులు ఆరోపించి ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన పై ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ టి.గౌరీ లక్ష్మిని వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు మృతికి సంబం ధించిన వివరాలు చెప్పకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగుల ఇకెవైసి 95 శాతం పూర్తి

తెర్లాం : ఉమ్మడి జిల్లాల్లోని ఉద్యోగుల ఇకెవైసి 95 శాతం పూర్తి చేశామని డిప్యూటీ ట్రెజరర్ ఆఫీసర్ కుమార్ అన్నారు. స్థానిక ట్రెజరీ కార్యాలయంలో గురువారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 24,345 మంది ఇకెవైసి పూర్తి చేశామన్నారు. జిల్లాలో నాలుగు కొత్త భవనాలు మంజూరు చేశామని టెండర్లు కూడా పిలిచామన్నారు. చీపురుపల్లి, విజయనగరం అర్బన్, ఎస్‌కోట, భోగాపురం ప్రాంతాల్లో కొత్త భవనాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ. 75లక్షలు మంజూరైనట్లు తెలిపారు. రాజాంలో నూతన భవనం పూర్తయిందని ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు. పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు

తెర్లాం: మండలం పెరుమలి అంగన్వాడీ సెంటర్‌లో గురువారం ఎఎన్ఎం భవాని పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. 45 రోజుల నుంచి ఒక సంవత్సరం వయస్సు లోపు పిల్లలకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. పోలియో, పక్షవాతం, క్షయ, దగ్గు వంటి వ్యాధులు రాకుండా ఈ టీకాలు ఉపయోగపడతాయన్నారు. ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎన్ లక్ష్మి, సునీత, రమణి, ఆశ వర్కర్ సువర్ణ, పార్వతి పాల్గొన్నారు.

ముందుకు సాగని అభివృద్ధి పనులు

బాడంగి: మండలంలోని కోడూరులో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని టిడిపి కోపుల వెలమ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. గురువారం మండల స్పెషల్ ఆఫీసర్ సూర్యచంద్రరావు, ఎంపిడిఒ ఆంజనేయులుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా కోడూరులో మాత్రమే అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని వాపోయారు. మంచి నీరు కూడ అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి చిన్నంనాయుడు, సత్యారావు పాల్గొన్నారు.

వంట పాత్రలు పంపిణీ

మెరకముడిదాం : మండలంలోని 72 పాఠశాలలకు జగనన్న గోరుముద్దకు సంబంధించిన వంట పాత్రలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి తాడ్డి వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పాత్రలను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థులకు చక్కని భోజనం పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం. చంద్ర శేఖర్, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల వెంకటరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్ వి రమణరాజు, వైసిపి నాయకులు రాము, ఎంపిడిఒ రత్నం, తహశీల్దార్ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం జగనన్న గోరుముద్ద వంట పాత్రలను పంపిణీ చేశారు. ఎంఆర్‌సి వాహనం ద్వారా పాఠశాలలకు పాత్రలను, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశామని ఎంఇఒ బాలభాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమృత కలశ యాత్ర

వేపాడ: స్థానిక సచివాలయం నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ఎంపిడిఒ, పట్యాయక్ ఆధ్వర్యంలో గురువారం అమృత కలశ యాత్ర ర్యాలీను చేపట్టారు. దేశం కోసం అమరులైన సైనికుల ప్రాణ త్యాగాలకు గుర్తుగా ఢిల్లీలో స్మారక స్థూపం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి, ఎపిఒ, ఎపిఎం, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ బయలుదేరుతున్న గ్రామ వాలంటీర్

మండలంలోని కొండపల్లి గ్రామం నుండి ఢిల్లీలో నిర్వహిస్తున్న అమృత కలశానికి మట్టి, నీరు పట్టుకుని వాలంటీర్ ఎం సింహాద్రిని పంపిస్తున్నట్లు ఎంపిడిఒ పట్నాయక్ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ, మండల ప్రత్యేకాధికారి వి. శ్రీనివాసరావు సూచించారు. గురువారం నగర పంచాయతీ పరిధి జరజాపు పేటలో హౌసింగ్ అధికార్లు జగనన్న కాలనీ సందర్శించి ఇంటి నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ నిర్మాణాలు జరపని లబ్ధిదారు లబ్ధిదారు ఇళ్ల వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభించక పోతే రద్దు జరిగే అవకాశం ఉందన్నారు. కాగా నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు కూడా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఆర్.పవన్, కార్యదర్శి దినేష్, వర్క్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో 19 పనులకు తీర్మానం

రేగిడి: మండలంలోని వాడిలపలస గ్రామంలో ఉపాధి పథకంలో భాగంగా 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 19 పనులకు గాను రూ.1.19 కోట్లు గుర్తించి తీర్మానం చేసినట్లు ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం గ్రామ వైసిపి నాయకులు, సర్పంచ్ ముయిద ప్రసన్న శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ పనులకు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. వలస నివారణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ గ్రామంలో పనులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రేషన్ అందజేయాలి

బొబ్బిలిరూరల్: తమ గ్రామానికి ప్రభుత్వ రేషన్ సరుకులు అందజేయాలని గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రంగరాయపురం గ్రామస్తులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి గుణుపూరు నారాయణరావు మాట్లాడుతూ నిత్యావసర వాహన దారు ప్రతినెలా తమ గ్రామానికి అందివ్వాల్సిన రేషన్ సరుకులు సక్రమంగా అందివ్వడం లేదని ఈ నెలలో 70, 80 కుటుంబాలకు రేషన్ ఇవ్వలేదని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆయన అన్నారు. ఈ వాహన దారుడను వెంటనే మార్చాలని సక్రమంగా సరుకులు అందజేయాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలపై అవగాహన

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలపై అవగాహన కల్పించారు. గురువారం విశ్వ విద్యాలయ జాతీయ ఉపకార వేతనాల నోడల్ అధికారి డాక్టర్ సన్నీ డియోల్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపకార వేతనాలు పొందడానికి కావాల్సిన అర్హతలు ఇతర వివరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎస్. ఆచార్యులు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

భోగాపురం: ఆటో బోల్తా పడిన ఘటనలో గాయపడిన జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఎరుసు రాము (56) బుధవారం రాత్రి మృతి చెందారు. ఈనెల 20న రాము భోగాపురంలో ముక్కాం వెళ్లి ఆటో స్టాండ్ వద్ద ఆటో ఎక్కి ఇంటికి వెళ్తుండగా జగ్గయ్యపేట వద్ద ఆటో బోల్తా పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే సుందర పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

భోగాపురం: భోగాపురం గ్రామానికి చెందిన ఆవాల రమణ (35) అనే వ్యక్తి చెరువులో పడి గురువారం మృతి చెందాడు. రమణ బుధవారం సాయంత్రం నుంచి కనబడకపోవడంతో తల్లిదండ్రులు, భార్య వెతికారు. గురువారం చూసేసరికి పంచాయతీ ఆఫీస్ వెనుక భాగంలో ఉన్న చెరువులో మృతదేహం తేలినట్లు గుర్తించారు. తండ్రి నర్సింగ్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ ఎన్నికల ప్రచారంగా కోడి కత్తి డ్రామా

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆనాడు జగన్ ఎన్నికల ప్రచారంలో కోడి కత్తి డ్రామా నడిపించారని నియోజకవర్గం ఇంచార్జి కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. గురువారం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కోడి కత్తి డ్రామా జరిగి ఐదేళ్లు పూర్తయిందని గుర్తు చేశారు. కోడి కత్తి కేసులో నిందితుడుగా ఉన్న శ్రీను నేటికీ విచారణ ఖైదీగానే జైల్లోనే మగ్గుతున్నారని అన్నారు. జగన్ విచారణకు రావాలని కోర్టు ఆదేశించిన కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకునేందుకు అవకాశం కల్పించాలంటూ ఆయన తరఫు పిటిషన్ వేయడం అత్యంత హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి నాయకులు చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరిలపై నచ్చినట్టు మాట్లాడటం మాని, ముందు మీ నాయకుడిని కోడి కత్తి కేసులో కోర్టులో హాజరైత అన్ని తెలుగుతాయని హితవు పలికారు. కాకినాడలో దళిత యువకుడి హత్య కేసులో ఎమ్మెల్సీ అనంత బాబు అరెస్టయ్యారు కానీ ఆరు నెలలలోపే బయటికి వచ్చారన్నారు. వైయస్ వివేకా హత్య కేసులో ఎంపి అవినాష్ రెడ్డి అరెస్ట్ అయిన ఐదు నిమిషాల్లో బెయిల్ పొందారన్నారు. కానీ ఏ ఆధారాలు లేకుండా ప్రజా నాయకుడు చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి 50 రోజులకు పైగా జైలుకే పరిమితం చేసి కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా ఇబ్బందులపాలు చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. భువనేశ్వరి తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళితే, జబర్దస్త్ రోజా కుప్పిగంతులేస్తుందన్నారు. మీ నాయకుడు పై ఆధారాలతో కూడిన కేసులు ఉన్నాయని బెయిల్ పై అధికారాన్ని అడ్డుపెట్టుకుని బయట ఉన్నాడని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, భీశెట్టి అరుణ, అనకాపల్లి చెల్లయ్య, కాపుగంటి వాసు, బంగారమ్మ, భీశెట్టి మొహన్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్వినికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కోళ్ల లలితకుమారి

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన కోళ్ల

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వినిని విజయనగరంలోని తన స్వగృహంలో ఎస్‌కోట నియోజకవర్గం ఇంచార్జి కోళ్ల లలిత కుమారి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు అరెస్టును జనసేన పార్టీ వ్యతిరేకిస్తున్నందున యశస్వినికి కోళ్ల లలిత కుమారి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన వీరమహిళ ఇంద్ర వెంకటలక్ష్మి, అలమండ రాంబాబు, టిఎన్ఎస్ఎఫ్ జనరల్ సెక్రటరి భూమిరెడ్డి మోహన్ రాజు, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీ మద్యపాన నిషేధం ఎక్కడ?

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

వేపాడ: దశల వారీగా మద్య పాన నిషేధం విధిస్తామన్న జగన్మోహన్‌రెడ్డి ఎందుకు ఆ పనిచేయడం లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఏపికి మద్యం సరఫరా చేస్తున్న యజమానుల జాబితా ఇవ్వగలరా అని ప్రశ్నించారు. 74 శాతం మద్యం సరఫరాను కేవలం 16 కంపెనీలే చేస్తున్నాయని అందులో భాగంగా అదాన్ డిస్టలరీస్ 2019లో ప్రారంభించారని గుర్తు చేశారు. రూ.1164 కోట్లు మేర మద్యం సరఫరా ఆర్డర్ అదాన్ కంపెనీ చేస్తుందన్నారు. ఈ కంపెనీకి వెనుక విజయ సాయి రెడ్డి ఉన్నారని ఆరోపించారు. చింతకాయల రాజేష్, పి మహేష్‌కు చెందిన సంస్థలను కూడా బలవంతంగానే అదాన్ చేజిక్కించుకున్నారని ఆరోపించారు. ఎస్‌పివై ఆగ్రో సంస్థ రూ. 1800 కోట్ల మేరా సరఫరా చేస్తున్న ఆర్డర్స్ ఉన్నాయని ఈ సంస్థ వెనుక ఎంపి మిథున్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ప్రకాశం జిల్లాలో పెర్ల్ డిస్టలరీస్‌ను సీఎం జగన్మోహన్ రెడ్డి సన్నిహితులు బలవంతం పెట్టి సబ్ లీజుకు చేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసే కంపెనీల జాబితాను కంపెనీల ఓనర్ల జాబితాను ఇవ్వాలని పలుమార్లు టిడిపి నాయకుల కోరినప్పటికీ నేటి వరకు ఇవ్వలేదన్నారు. దమ్ముంటే ఇప్పటికైనా ప్రభుత్వానికి మద్యం సరఫరా చేస్తున్న కంపెనీల జాబితాను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రిఫరల్ రోగులను కెజిహెచ్‌కు పంపాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చే రోగులను విజయనగరం కాకుండా విశాఖపట్నం కింగ్ చార్జ్ ఆసుపత్రికి రిఫరల్ చేసే ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో 100 పడకలుగా ఉన్న ఆసుపత్రికి ప్రతిరోజు వందల మంది రోగులు పాడేరు, అరకు, అనంతగిరి, ఎస్‌కోట, వేపాడ, గంట్యాడ మండలాల నుంచి వస్తున్నారని చెప్పారు. కమ్యూనిటీ ఆసపత్రి నుంచి ప్రాంతీయ ఆసుపత్రిగా అభివృద్ధి చెందినప్పటికీ, డాక్టర్ల సంఖ్య పెరిగినప్పటికీ ఈ ఆసుపత్రికి రిఫరల్ ఆసుపత్రిగానే ముద్రపడిందని అన్నారు. అత్యవసర కేసులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న కేసుల నుంచి తప్పించుకుని సిబ్బంది నిర్లక్ష్యంగా విజయనగరం రిఫర్ చేస్తున్నారన్నారు. రిఫరల్ చేసేటప్పుడు రోగి బంధువులు విజయనగరం పంపించవద్దని విశాఖపట్నం కెజిహెచ్ కు పంపించాలని వేడుకున్న కేజీహెచ్‌కు పంపించడం లేదన్నారు. పైగా విజయనగరం పంపించినా అక్కడ సిబ్బంది తిరిగి కెజిహెచ్‌కే రిఫర్ చేస్తున్నారని దీని వల్ల సమయాభావం పెరిగి ప్రమాదం ముదురుపోతుందన్నారు. ఈ మధ్యకాలంలో మండలంలోని వీరనారాయణ గ్రామానికి చెందిన చల్లా జోగారావుకు సకాలంలో వైద్యం అందక చనిపోయాడన్నారు. గిరిజన రోగలైతే లెక్కకు దొరకనంతమంది విజయనగరం నుంచి సకాలంలో కేజీహెచ్‌కు చేరుకోలేక చనిపోతున్నారని గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అత్యవసర రోగులను 108 ద్వారా నేరుగా కెజిహెచ్‌కే తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రోగుల బంధువులు కిల్లో రవి (అరకు), చీమల రవి (బొడ్డవర), వారాది దేవుడు (చుక్కపాలెం), సిదరి రాజు (రేగ పుణ్యగిరి) తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

రేగిడి : పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంఇఒ ఎం వరప్రసాదరావు సూచించారు. ఈ మేరకు గురువారం ఉంగరాడ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ సకాలంలో పాఠశాలకు హాజరై ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్య ప్రణాళికను తప్పనిసరిగా పాటించి విద్యార్థులకు బోధనను అందించాలని సూచించారు. ఎంఇఒతో పాటు హెచ్ఎం వెంకటరమణ, సహ ఉపాధ్యాయులు శ్యాం కుమార్, వి మోహన్ రావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పలు పాఠశాలలను ఎంఇఒ త్రినాధరావు గురువారం పరిశీలించారు. చిన్నయ్యపేట ఎంపిపి పాఠశాలలో పిల్లల విద్య ప్రామాణికం, వర్క్ బుక్స్ ఎఫ్ఎ-2 ఎగ్జామినేషన్ రిజల్ట్, ఉపాధ్యాయుల పాఠ్యాంశ ప్రణాళికలు, పలు రికార్డులు పరిశీలించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తనిఖీ చేశారు. జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ గురించి ఆరా తీశారు.

పేదల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొండపల్లి

పేదవారి అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పాలన అందిస్తుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గురువారం మండ లంలోని గొట్లాం గ్రామంలో సచివాలయ భవ నం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాల యాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నా మన్నారు. నాలుగేళ్లలో జగనన్న ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పరి తపిస్తున్న వైయస్ జగనమోహన్ రెడ్డిని మరోసారి ముఖమంత్రిని చేయాలని ప్రజలను కోరారు. ప్రజల ఆలోచన విధానంలో మార్పు రావాలని, మంచి, చెడులను బేరీజు వేయాలని అన్నారు. ప్రతిపక్ష టిడిపి నాయకుల కల్లబొల్లి మాటలను నమ్మ వద్దని వాస్తవాన్ని గుర్తించాలని సూచించారు. వాలంటీర్లు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలపై వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ఎఎంసి చైర్మన్ ముత్యాలనాయుడు, ఎంపిడిఒ వై.బి.రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి సుగుణాకర రావు, వైస్ ఎంపిపిలు మీసాల సరోజిని, గొట్లాం పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, ఎపిఒ బి.కృష్ణవేణి, ఎపిఎం. సులోచనా దేవి, ఎఒ మల్లికార్జున రావు, సిఎస్‌డిటి రవిశేఖర్, గొట్లాం, వెంద్రాం, ముద్దూరు సర్పంచులు ఆదిలక్ష్మి, కర్రోతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకు 29న ధర్నా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 29న జరగనున్న ఎపి టిఎఫ్ 1938 రాష్ట్ర ధర్నా జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎన్.వి.పైడిరాజు పిలుపు నిచ్చారు. ధర్నా జయప్రదం చేయాలని కోరుతూ గురువారం జరజాపు పేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29న విజయవాడలో ఎపిటిఎఫ్ 1938 ఆధ్వర్యంలో రాష్ట్ర ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాత పద్ధతిలో పింఛన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2003 డియస్‌సి వారికి పాత పద్ధతిలో పెన్షన్ అమలు చేయాలని, పాఠశాల విద్యలో విధ్వంసం సృష్టించే జిఒ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 1న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు, పెన్షన్ దార్లకు పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, డిఎ బకాయిలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఉంద్రు శ్రీనివాసరావు, కాళ్ళ అప్పారావు, ఎన్. బాబ్జీ, సిహెచ్ ఎర్రి నాయుడు, ఎన్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న విజయవాడ, అలంకార్ సెంటర్‌లో ధర్నా చౌక్ వద్ద జరగనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఎంఇఒ కార్యాలయ ఆవరణలో గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చప్ప వెంకటరమణ, బొబ్బిలి మండల అధ్యక్షులు సీర సన్యాసి నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటనాయుడు, సిహెచ్ రామారావు, జిల్లా కార్యద్శి గంట సత్యనారాయణ, బొబ్బిలి మండలశాఖ ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్, గోపాలకృష్ణ, వెంకటేష్, కృష్ణదాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

ప్రజాశక్తి- బాడంగి

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎంపిపి గౌరి, జడ్‌పిటిసి రామారావు, మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్ర రావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డాక్టర్ల దగ్గరకు ప్రజలు వెళ్లేవారని, ఇప్పుడు ప్రజల వద్దకే డాక్టర్లు వస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆంజినేయులు, సర్పంచ్ రమేష్, ఎంపిటిసి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు బొమ్మినాయని వెంకట్ నాయుడు, వైస్ ఎంపిపి రమేష్, సచివాలయం కన్వీనర్లు, వైసిపి నాయకులు వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: జగనన్న ప్రభుత్వంలో సంక్షేమమైనా, ఆరోగ్యమైనా మీ ఇంటి ముంగిటికేనని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని కిల్తంపాలెం గ్రామ సచివాలయం భర్తపురం గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరములను ప్రజలు సద్వినియోగం చేసుకుని చక్కని ఆరోగ్య వంతులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం, మెడికల్ క్యాంపు రూమ్‌లు, కంప్యూటర్ డేటా సెంటర్‌ను పరిశీలించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ఓపి రిజిస్ట్రేషన్, స్పాట్ రిజిస్ట్రేషన్, ఐటి రూమ్, వైద్యుల కేటాయింపు, ల్యాబ్, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, వైద్యుల గదులు, మందుల కౌంటర్, న్యూట్రిషన్ స్టాల్, కంటి పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, స్థానిక సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, పాల్గొన్నారు.

చెరువు గర్భం ఆక్రమణలు అరికట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో కొంతల వాని చెరువు గర్భంలో ఆక్రమణలు అరికట్టాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన కమిషనర్ బాలాజీ ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా సర్వే నెంబర్ 100 కొంతల వాని చెరువు గర్భాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు జరుపుతున్నారన్నారు. ఇదే కొంతల వాని చెరువు నీటి తో సర్వే నెంబర్ 95లో ఎంతో మంది పేద రైతులు వ్యవసాయం చేస్తున్నారని ఆక్రమణకు గురైతే వారికి సాగు నీరు అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు నీటి మీద ఆధార పడి పశువులు కూడా జీవిస్తున్నాయని వాటికి కూడా నీరు అందకుండా



కమిషనర్‌కు వినతి పత్రాన్నిస్తున్న రామారావు

పోతుందని తెలిపారు. కాగా చెరువు ఆక్రమణ పై పలుమార్లు తహశీల్దార్, కలెక్టర్ గ్రీవెన్స్, కమిషనర్, నీటి పారుదల శాఖ అధికార్లకు కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైన అధికార్లు స్పందించి చెరువు ఆక్రమణ నివారించి రైతులకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో న్యాయ స్థానాన్ని ఆశ్రయించక తప్పదని హెచ్చరించారు.

ఇ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

ఇ- పంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని స్థానిక వ్యవసాయాధికారి వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం-2లో గురువారం ఇ పంట నమోదు వివరాలు పరిశీలించి దీనివల్ల సమకూరే ప్రయోజనాలను వివరించారు. ఇది రైతు పంటల అమ్మకాలకు, కొనుగోలుకు ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటల నమోదుకు, మద్దతు ధరలు పొందేందుకు దీన్నే ప్రామాణికంగా తీసుకుంటామని, ప్రభుత్వం ద్వారా మంజూరైన నష్ట పరిహారాలు చెల్లింపులకు ఉపకరిస్తుందన్నారు. పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు తీసుకోవడానికి ఈ పంటలో నమోదైన వారే అర్హులన్నారు. ఇప్పటికే అర్హులైన రైతులందరికీ వర్తింప జేసామని, ఈ నెలాఖరు వరకు ప్రతీ ఆర్‌బికెలో నమోదైన వారి వివరాలు ప్రదర్శనగా ఉంచుతామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చి సరిచేసు కోవాలని కోరారు. ప్రస్తుతం మండలంలో సాగు చేస్తున్న అన్ని పంటలకు సాగునీటి నిల్వలు ఆశా జనకంగానే ఉన్నాయని మరో 10 రోజుల వరకు ఇబ్బంది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాఫ్ అర్హుల జాబితా ప్రదర్శన

అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న ఎఒ

నెల్లిమర్ల: మండ లంలోని సారిపల్లిలో సామజిక తనిఖీ కోసం ఈ క్రాప్ అర్హులు జాబితాను ఎఒ ఎం. పూర్ణిమ గురువారం ప్రదర్శించారు. ఈ జాబితా ఈ నెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు ప్రతీ రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శిస్తారని చెప్పారు. ఈనెల 29వ తేదీ వరకు జాబితాలో రైతులు పేర్లు, సర్వే నంబర్స్, పంటల సాగు, విస్తీర్ణంలో ఏలాంటి అభ్యంతరాలు ఉన్న రాత పూర్వకంగా విఎఎ, విహెచ్ఎ, విస్ఎలకు తెలియజేయాలన్నారు. నవంబర్ 1వ తేదీన తుది జాబితా రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ వి భవాని, విఎఎ ఎం హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని సిరికి రిసార్ట్స్ ఇండోర్ స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల బాడ్మింటన్ సెలక్షన్స్ అండ్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలో గల 8 నియోజకవర్గాల నుండి దాదాపు 160 మంది క్రీడాకారులు ఈ సెలక్షన్స్, టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారన్నారు. ఇక్కడ ఎంపికైన టీమ్ విశాఖపట్టణంలో నవంబరు 9 నుండి 11 వరకు జరుగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

రాష్ట్రస్థాయి పోటీలలో కూడా విజయదుందుభి మోగించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ క్రీడా పోటీలకు ఆతిథ్యమిచ్చిన సిరికి రిసార్ట్స్ యాజమాన్యం, క్రీడాకారులకు భోజనాలు ఏర్పాటు చేసిన ముంతాజ్ బ్రదర్స్, అరటిపళ్ళు సమకూర్చిన మంథా సుబ్బారావు, మజ్జిగ ప్యాకెట్లు సమకూర్చిన పాలకుర్తి శివకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్.వి.రమణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎన్. వెంకటనాయుడు, విడిఎస్ఎస్ఎస్‌వి కార్యదర్శి లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు స్వరూప్, శాంతి, పాప, జగదీష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

అండర్ 19 బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పూర్తి

విజయనగరం టౌన్: చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఈనెల 28,29,30 తేదీల్లో జరగనున్న రాష్ట్ర అండర్ 19 బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక గురువారం విజ్జి స్టేడియంలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు హాజరు కాగా, వారిలో 12 మంది బాలురు, 12 మందితో బాలికల జట్లను ఎంపిక చేసినట్లు అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి వివిఎల్ఎన్ కృష్ణ తెలిపారు.

పీడీ భానును సత్కరిస్తున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి, తదితరులు

విద్యార్థుల్లో ఉండే సామర్థ్యం, ప్రతిభను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

పీడీకి కబడ్డీలో కాంస్య పతకం

డెంకాడ: ఇటీవల ఢిల్లీలో జరిగిరన అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల ఆటల పోటీల్లో కబడ్డీ విభాగంలో మండలంలోని రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కూర్మాను భాను పాల్గొని కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆయన్ను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి, ఉప విద్యాశాఖాధికారి పి వాసుదేవరావు, బ్రహ్మాజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఇబ్బందులు లేకుండా చర్యలు

- కమిషనర్ శ్రీరాములు నాయుడు
- పలు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ సిరిమాను జాతరకు విచ్చేస్తున్న భక్తులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ట్యాంక్‌బండ్ రోడ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపించాలని సిబ్బందికి ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వివాహన చోధకులకు అవసరమైన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి వాటిని చదును చేసే ప్రక్రియను రేపటిలోగా పూర్తి చేయాలని చెప్పారు. బొంకులదిబ్బ ప్రాంతంలో సురభి నాటక ప్రదర్శనలు జరగనున్న నేపథ్యంలో సభాస్థలిని చదును చేయాలని సూచించారు. పైడితల్లమ్మ దేవస్థానం చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి, ఎక్కడా అపరిశుభ్ర వాతావరణ లేకుండా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. జాతర ప్రాంతాల్లో పారిశుధ్యానికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు చెప్పారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బయో టాయిలెట్లను ఏర్పాటు

వీధుల్లో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇఇ దక్షిణామూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I KOPPULA NARAYANA MURTY S/o late VEERA RAGHAVULU NAIDU, Door No. 18-9/1-2, Chinnapalli street, Near kaspa high school, vizianagaram Dist.-pin - code-535002, Andhra pradesh. By mistake My name was wrongly entered in my indian passport bearing no L7637697 as **KOPPULA NARAYANA MURTHI** insteads of my correct name is **KOPPULA NARAYANA MURTY** as per Aadhar card No 303841855567. Hence I request you change my name as **KOPPULA NARAYANA MURTY** (Orginal name)